బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు సాయం

బీమా చెక్ అందజేస్తున్న బెల్లం వేణు, వరప్రసాద్

ఖమ్మం రూరల్, మే 29: మండలంలోని గుర్రాలపాడు గ్రామానికి చెందిన జాల సురేష్, నగరంలోని 59వ డివిజన్ దానవాయిగూడెం గ్రామానికి చెందిన తీగల వెంకన్న ఇటీవల రైలు ప్రమాదంలో మృతిచెందారు. బీఆర్ఎస్ క్రియాశీలక సభ్యులైన వీరిద్దరికీ పార్టీ తరపున రూ.2లక్షల చొప్పున బీమా చెక్కులను వారిద్దరి కుటుంబీకులకు మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, జడ్పీటీసీ సభ్యుడు వరప్రసాద్ బుధవారం అందించారు. మండలంలోని సాయిగణేష్ నగర్‌లోగల మాజీ ఎమ్మెల్యే కందాళ క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఎన్.మధుబాబు, దామాల రవి, బుర్రా మహేష్, శీలం రవికుమార్, సిహెచ్.వినయ్ తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ పతాకావిష్కరణ

జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

కారేపల్లి, మే 29: టీపీటీఎఫ్ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పతాకాన్ని మండల అధ్యక్ష, కార్యదర్శులు జి.వెంకటేష్, మల్లం హరీష్ బుధవారం ఆవిష్కరించారు. కారేపల్లిలో జరిగిన ఈ కార్ర్యక్రమంలో నాయకులు ఉడుగు సుధాకర్, అన్నవరపు దామోదర్‌రావు, దేవరకొండ నాగభూషణం, చాగంటి నాగేశ్వరరావు, సుందర్, మల్లేశ్వరరావు, ఇమ్మానియేల్, అబ్దుల్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై అవగాహన

రైతు అవగహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ విజయ్‌చంద్ర

కూసుమంచి, మే 29: నకిలీ విత్తనాలపై రైతులకు ఏడీఏ విజయ్ చంద్ర అవాహన కల్పించారు. మండలంలోని పోచారం, గుర్వాయిగూడెం గ్రామాల్లో జరిగిన ఈ కార్యక్రమాలో మాట్లాడుతూ.. లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే విత్తనాలను కొనాలని, రసీదులను పంట కాలం పూర్తయ్యేంత వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. ఏవో వాణి పాల్గొన్నారు.

వాలీబాల్ క్రీడాకారుడి మృతికి సంతాపం

సత్తుపల్లి, మే 29: తల్లాడకు చెందిన వాలీబాల్ క్రీడాకారుడు గరిడేపల్లి నరేష్ తీవ్ర అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. మృతదేహాన్ని మండలానికి చెందిన వాలీబాల్ సీనియర్ క్రీడాకారులు గోపాల్‌రెడ్డి, షేక్ మెహరాజ్, తంబి, సంపత్, వినోద్, కృష్ణ, అజయ్, దాదా తదితరులు నరేష్ ఇంటికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబీకులకు సంతాపం, సానుభూతి తెలిపారు.

మైక్రో ఫైనాన్స్ వేధింపులపై ఫిర్యాదు

పెనుబల్లి, మే 29: ఖమ్మం మైక్రో ఫైనాన్స్ సిబ్బందిపై వీ.ఎం.బంజర పోలీస్ స్టేషన్‌లో మండలంలోని ఉప్పలచెలక గ్రామస్తురాలు భూషిరాణి బుధవారం ఫిర్యాదు చేసింది. నెలసరి వాయిదా చెల్లించడం ఆలస్యమవడంతో రాత్రి వేళ తమ ఇంటికి మైక్రో ఫైనాన్స్ సిబ్బంది వచ్చి దుర్భాషలాడారని పేర్కొంది. వారిపై చర్యలు తీసుకోవాలని కోరింది.

'మృత్యు' మలుపులు..!

ప్రమాదకరంగా మారిన మూల మలుపులు

ఈ మూల మలుపులు చూశారా..! ఈ రోడ్లపై పగటి పూట ప్రయాణమే కష్టం. రాత్ర వేళ ఇంకెంత దారుణంగా ఉంటుందో ఊహించుకోండి. ఈ రోడ్డుపై మూల మలుపు ఉందన్న విషయం గ్రహించని/తెలియని వాహన చోదకులు వేగంగా వస్తే.. అదే సమయంలో అంతే వేగంతో ఎదురుగా మరో వాహనం దూసుకొస్తే.. ప్రమాదం జరుగుతుంది. చోదకులకు తీవ్ర గాయాలు కావొచ్చు, ప్రాణాలే పోవచ్చు. అదే జరిగితే.. ఆ వ్యక్తి/వ్యక్తుల కుటుంబీకులు/ఆత్మీయులు అనుభవించే వేదన-రోదన వర్ణణాతీతం. ఆ క్షతగాత్రులు/మృతులపై వారి కుటుంబీకులు ఆధార పడినట్లయితే.. వారి పరిస్థితి ఏమవుతుందో, వారి జీవితాలు ఎంతగా తలకిందులవుతాయో చెప్పలేం. ఈ మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులుగానీ, స్పీడ్ బ్రేకర్లుగానీ ఏర్పాటు చేస్తే.. వాహన చోదకులు అప్రమత్తమవుతారు. ప్రమాదాల నుంచి తప్పించుకోగలుగుతారు. ఈ ఒక్క చిన్న పని చేయడానికి సంబంధిత అధికారులకు వచ్చిన ఇబ్బందేమిటి..? అడ్డంకేమిటి..? వైరా నుంచి స్టేజిపినపాక, కెజి సిరిపురం, నారపనేనిపల్లి, విప్పలమడక, దాచాపురం, ఆంధ్రా సరిహద్దు ప్రాంతమైన నెమలి వరకు ఇలాంటి ప్రమాదకర మలుపులు అనేకం ఉన్నాయి. ఈ మార్గంలో నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ మలుపుల వద్ద ఇప్పటికే అనేకసార్లు ప్రమాదాలు జరిగాయి. అయినప్పటికీ సంబంధిత అధికారుల్లో ఏమాత్రం చలనం లేదు. 'ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా..? మేం ప్రమాదాలబారిన పడి గాయాలపాలవుతున్నా, మా నిండు ప్రాణాలు పోతున్నా ఏమాత్రం స్పందించకుండా చోద్యం చూస్తుంటారా..? ఇది నిర్లక్ష్యమా.. బాధ్యతా రాహిత్యమా..?'- ఇవన్నీ, ఇక్కడి ప్రజలు సూటిగా అడుగుతున్న ప్రశ్నలు. ఈ మూల మలుపులను మన అధికారులు 'మృత్యు పిలుపులు'గానే ఉంచుతారో, 'ప్రమాదరహిత మలుపులు'గా మారుస్తారో.. వేచి చూద్దాం.

– వైరా రూరల్, మే 29

సొసైటీల్లో విత్తనాల పంపిణీ

బోనకల్లు: పచ్చిరొట్ట విత్తనాలు అందుకుంటున్న రైతులు

కొణిజర్ల: రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఏడీఏ కరుణశ్రీ

ఎర్రుపాలెం: రైతులకు విత్తనాలు అందజేస్తున్న వ్యవసాయాధికారులు

బోనకల్లు, మే 29: రైతులకు పంపిణీ చేసేందుకు పత్తి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోనకల్లు మండలంలోని రావినూతల గ్రామంలోగల ఓ దుకాణం వద్దకు రైతులంతా ఒకేసారి వచ్చారని, అక్కడి డీలర్ సూచనతో అందరూ క్యూ పద్ధతి పాటించారని వివరించారు. వారందరికీ విత్తనాలు అందాయని పేర్కొన్నారు. విత్తనాలకు ఎలాంటి కొరత లేదని స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఆందోళన అవసరం లేదని,. విత్తనాలను ప్రశాంతంగా కొనుగోలు చేసుకోవచ్చని పేర్కొన్నారు..

పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

బోనకల్లు, మే 29: మండలంలోని కలకోట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో బుధవారం పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ జరిగింది. వ్యవసాయ విస్తరణ అధికారి నాగనేని నాగసాయి, సంఘం కార్యదర్శి వనమా మల్లికార్జున్ పాల్గొన్నారు.

కొణిజర్ల, మే 29: మండలంలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీని వైరా ఏడీఏ కరుణశ్రీ బుధవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. మండలానికి జీలుగు విత్తనాలు 48 టన్నుల 960 కేజీలు, జనుములు 10 టన్నులు వచ్చాయని చెప్పారు. ఇవి చాలకపోతే జిల్లా వ్యవసాయాధికారితో మాట్లాడి ఇంకా తెప్పిస్తామన్నారు. మండల వ్యవసాయాధికారి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం, మే 29: మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులకు 60 శాతం సబ్సిడీపై జీలుగు విత్తనాలను సొసైటీల అధికారులు బుధవారం పంపిణీ చేశారు. మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి, ఏఈవోలు ధాత్రి, జిష్ణు, బాలకృష్ణ, సుష్మ, బొగ్గుల శివారెడ్డి, వీరారెడ్డి, ఏసుబాబు, శ్రీనివాసరావు, కన్నయ్య పాల్గొన్నారు.

4న పాత పార్సిళ్ల వేలం

ఖమ్మం, మే 29 : ఖమ్మం ఆర్‌టీసీ డిపో పరిధిలోని ఖమ్మం బస్టాండ్‌లో కార్గో అండ్ పార్సెల్ సర్వీస్ విభాగానికి సంబంధించి వినియోగదారులు తీసుకెళ్లని పాత పార్సిళ్లను జూన్ 4వ తేదీ మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు ఖమ్మం కొత్త బస్టాండ్ ఆవరణంలో వేలం వేయనున్నట్లు ఏటీమ్ ఉమ్మడి ఖమ్మం వరంగల్ జిల్లాల లాజిస్టిక్ మేనేజర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు వేలంపాటలో పాల్గొనాలని సూచించారు.

నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయండి

పెనుబల్లి, మే 29: రైతులకు డీలర్లు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలని వ్యవసాయ సహాయ సంచాలకుడు ఉళ్లోజు నరసింహారావు అన్నారు. విత్తన డీలర్లతో ఆయన బుధవారం పెనుబల్లిలో సమావేశం నిర్వహించారు. విత్తనాలు కొన్న రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. ఎస్సై వెంకటేష్, మండల వ్యవసాయాధికారి ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను పూర్తిచేయాలి : కలెక్టర్

పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

మామిళ్లగూడెం, మే 29 : పాఠశాలల పునఃప్రారంభంలోపు అమ్మ ఆదర్శ పాఠశాలల పనులన్ని పూర్తి చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ రఘునాథపాలెం మండలం వేపకుంట్ల లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఖమ్మం నగరం రాపర్తినగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, బురహాన్‌పురం విద్యానగర్‌కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఖమ్మంరూరల్ మండలం కొత్తూరు(వై), చిన్న తాండలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు సందర్శించి, అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో తనిఖీలు చేశారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పాఠశాలల పునఃప్రారంభంలోపు విద్యార్థులందరికీ యూనిఫాం అందేలా చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, డీఆర్డీవో సన్యాసయ్య, డీఈవో సోమశేఖరశర్మ, మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, అధికారులు ఉన్నారు.

విత్తనాలను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

విత్తన షాపుల్లో తనిఖీలు చేస్తున్న అధికారులు

ఖమ్మం వ్యవసాయం, మే 29 : అధిక ధరలకు విత్తనాలను అన్నదాతలకు అంటగట్టి సొమ్ము చేసుకోవాలని చూస్తే కటకటాలపాలు కాకతప్పదని ఖమ్మంనగర వ్యవసాయశాఖ అధికారి కిషోర్‌బాబు, త్రీటౌన్ సీఐ రమేశ్ హెచ్చరించారు. బుధవారం త్రీటౌన్ ప్రాంతంలోని పలు విత్తనషాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. వెంకటరమణ సీడ్స్, లక్ష్మీ వెంకటరమణ, ఉషశ్రీ మార్కెటింగ్ ఏజెన్సీ షాపుల్లో పత్తి, మిరప విత్తన ప్యాకెట్లను నిశితంగా పరిశీలించారు. షాపులకు విత్తనాల కోసం వచ్చిన రైతులతో మాట్లాడారు. రైతుల సమస్యలు, విత్తనాల లభ్యత తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం వారు మాట్లాడుతూ సీజన్ ముగిసే వరకు వ్యవసాయ, పోలీస్‌శాఖ సంయుక్తంగా తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు వ్యవసాయ, పోలీస్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టు వైద్యానికి టీజేఎఫ్ నేతల ఆర్థికసాయం

జర్నలిస్టు కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న ఆకుతోట ఆదినారాయణ

ఖమ్మం సిటీ, మే 29 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు బ్రెయిన్ స్ట్రోక్ వ్యాధికి గురై ఖమ్మంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చేరారు. సమాచారం అందుకున్న టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ వెంటనే స్పందించారు. జర్నలిస్టు చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లి రూ.10 వేలు సాయం అందించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
★అర్జెంట్‌గా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & ITI మెకానిక్స్ కావలెను. మంచి జీతం,వసతి సౌకర్యం కలదు. సంప్ర: 9392663777, 9246663777, 9290003999.
NT-339514-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

'మోడల్'లో ప్రవేశానికి గడువు పొడిగింపు

కారేపల్లి,మే 29: స్థానిక తెలంగాణ మోడల్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు గడువును ఈ నెల 31 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ ఎండి.అక్తర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీలలో 40 చొప్పున సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు స్కాలర్ షిప్ వస్తుందని తెలిపారు. బాలికలకు వసతి సదుపాయం ఉందని పేర్కొన్నారు www.tsmodelschools.com ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616



ఆర్థిక సాయం అందిస్తున్న మిత్ర బృందం

స్నేహమంటే ఇదేరా..!

స్నేహమంటే ఏమిటి..?
కలిసి తిరగడం, కలిసి తినడం, కలిసి తాగడం..
ఇంతేనా..! ఇదేనా సమాధానం..!?
కానే కాదు..
స్నేహమంటే.. బంధం, బాధ్యత..!!
దీనిని ఆ యువకులు చేతల్లో చూపించారు.
'స్నేహమంటే ఇదేరా..!'
అంటూ చాటి చెప్పారు.

సత్తుపల్లి, మే 29: తల్లాడకు చెందిన అతడి పేరు దగ్గల జితేందర్ రెడ్డి. ఇతడు ఇటీవల మృతిచెందాడు. తల్లాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1988-89 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులందరినీ ఇతడు గతంలో ఓసారి సమీకరించి, నాడు తాము చదువుకున్న బడిలోనే సమ్మేళనం నిర్వహించాడు. తమ మిత్రుడు జితేందర్ రెడ్డి భౌతికంగా దూరమయ్యాడన్న విషయం తెలుసుకున్న అతని సహాధ్యాయులు కలత చెందారు. వారంతా పరస్పరం సంప్రదించుకున్నారు. ఆయన కుటుంబానికి ఎంతోకొంత ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించుకున్నారు. అంతా కలిసి రూ.40వేలు సేకరించారు. ఆ మొత్తాన్ని తల్లాడలోని జితేందర్ రెడ్డి కుటుంబీకులకు బుధవారం అందజేశారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తమ మిత్రుడిని మదిలో తలుచుకుంటూ.. 'స్నేహమంటే ఇదేరా..! స్నేహితులమంటే మనమేరా..!!' అనుకుంటూ, మూగగా రోదించారు. తామంతా ఉన్నామని, అండగా ఉంటామని మిత్రుడి కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. సహాధ్యాయులు మొక్కా రాంబాబు, దగ్గల కరుణాకర్ రెడ్డి, గుడిపల్లి నారాయణ, నాగేశ్వరరావు, కల్యాణపు సంపత్‌కుమార్, నంబూరి శ్రీనివాసరావు, వలపర్ల రాంబాబు, బండారు జనార్ధనరావు, నల్గొండ శ్రీనివాసరావు, అప్పారావు, షేక్ జానీపాషా, పాలవెల్లి నాగయ్య, డీఎన్.రెడ్డి, కొండా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మేరీమాత విగ్రహావిష్కరణ

– 76 అడుగులతో దేశంలోనే అతిపెద్ద విగ్రహం
– పాలేరుకు రానున్న పీఠాధిపతులు

76 అడుగుల మేరీమాత విగ్రహం

కూసుమంచి, మే 29: దేశంలోనే అతిపెద్ద మేరీ మాత విగ్రహాన్ని పాలేరులోని బాలయేసు ప్రార్థనా మందిరంలో ఫాదర్ కొమ్ము ఆంటోనీ ఆధ్వర్యంలో నిర్మించారు. 25 సంవత్సరాల చర్చి సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా జరుగుతున్న వేడుకల్లో ఈ నెల 30వ తేదీ గురువారం మేరీ మాత విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ వేడుకల్లో ఖమ్మం పీఠాధిపతి డాక్టర్ సగిలి ప్రకాష్, నల్లగొండ బిషప్ కరణం ధమన్, వరంగల్ బిషప్ డాక్టర్ ఉడుముల బాల, ఖమ్మం విశ్రాంతి బిషప్ మైపన్ పాల్, వరంగల్ ప్రొవెన్షియల్ సుపిరియల్ సిస్టర్ బిజీ జోసఫ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన అనేకమంది ముఖ్యులు, మత గురువులు హాజరుకానున్నారు.

పాలేరులో శోభాయాత్ర..

దేశంలోనే అతిపెద్ద మేరీమాత విగ్రహావిష్కరణ సందర్భంగా పాలేరులో గురువారం అతిథులు రాకతో శోభాయాత్ర నిర్వహిస్తామని ఫాదర్ ఆంటోని తెలిపారు. విశ్రాంత గురుకుల ప్రిన్సిపాల్ కొమ్ము ప్రసాద్ కార్యక్రమానికి కన్వీనర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. అతిపెద్ద మేరీమాత విగ్రహావిష్కరణ విజయవంతం చేయడానికి అందరి సహకారం అందించాలని కోరారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న నాయకులు

ఎర్రుపాలెం, మే 29: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో ఉపాధి హామీ పథకం కూలీలకు బీఆర్ఎస్ నాయకులు బుధవారం మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ రామకోటయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ తక్కెళ్లపాడు గ్రామ అధ్యక్షుడు కూరపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

వేంసూరు, మే 29: స్థానిక అంబేద్కర్ నగర్ వద్ద గంజాయిని ఎస్సై వి.వీరప్రసాద్ పట్టుకున్నారు. ఆయన తెలిపిన వివరాలు.. సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామస్తుడు కలపాల రాంబాబు, వేంసూరు మండలం లింపాలెం గ్రామస్తుడు రాయల పవన్ సాయికృష్ణ, తమ స్నేహితులు పండు, సందీప్‌తో కలిసి సీలేరు ప్రాంతం నుంచి ఐదు కేజీల గంజాయిని తీసుకొచ్చారు. ఇందులో కొంత, దమ్మపేట మండలానికి చెందిన వ్యక్తికి ఇటీవల విక్రయించారు. అప్పుడు వారిపై కేసు నమోదైంది. తాజాగా.. పవన్ సాయికృష్ణ, రాంబాబు కలిసి బుధవారంపై బైక్‌పై రేజర్ల, లింగపాలెం మీదుగా లంకపల్లి వెళ్తున్నారు. వేంసూరు అంబేద్కర్ నగర్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులకు వీరిద్దరూ పట్టుబడ్డారు. 400 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనపర్చుకున్నారు. వీరి నుంచి బైక్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనపర్చుకున్నారు. పండు, సందీప్ పరారీలో ఉన్నారు. కేసును ఎస్సై దర్యాప్తు చేస్తున్నారు.

పంట కాల్వలను పునరుద్ధరించాలి

సోమవరం పంట కాల్వను పరిశీలించిన నాయకులు

వైరా టౌన్, మే 29: పంట కాల్వల పునరుద్ధరణ పనును యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, జిల్లాలోని సాగర్ ఆయకట్టు చివరి భూములకు సాగు నీరు అందించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని సోమవరం మైనర్ పంట కాల్వలను నాయకులు బుధవారం పరిశీలించారు. రాంబాబు మాట్లాడుతూ.. కొన్నిచోట్ల పంట కాల్వల ఆనవాళ్లు కూడా లేవని, సోమవరం చివరి ఆయకట్టు పరిధిలోని పంటలకు రెండేళ్ల నుంచి నీరు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. చింతనిప్పు చలపతిరావు, సుంకర సుధాకర్, హరి వెంకటేశ్వరరావు, సంక్రాంతి నర్సయ్య, మోహన్‌రావు పాల్గొన్నారు.

తుళ్లూరికి నివాళి

సత్తుపల్లి టౌన్, మే 29: సత్తుపల్లి పట్టణానికి చెందిన మాజీ వైస్ చైర్మన్ తుళ్లూరి ప్రసాద్ రెండవ వర్ధంతి సందర్భంగా ఆయనకు పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. స్థానిక ఎన్టీఆర్ కాలనీలో మాజీ కౌన్సిలర్ వంటల హనుమంతు, తుర్లపాటి గిరి బుధవారం తుళ్లూరి ప్రసాద్ వర్ధంతి సభ నిర్వహించారు. చలసాని సాంబశివరావు, తుమ్మల యుగంధర్, ఉడతనేని అప్పారావు, చల్లగుళ్ల నర్సింహారావు తదితరులు నివాళులర్పించారు.